ఈ-కేవైసీ ఇక సులభం

- అందుబాటులోకి కిసాన్ యాప్
- ఎక్కడి నుంచైనా పూర్తి చేసుకునేలా అవకాశం

సత్తెనపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతలకు సంక్షేమ పథకాలు అందించేందుకు ఈ - కేవైసీని ప్రామాణికంగా తీసు కుంటున్నాయి. రైతు భరోసా సాయం అందాలన్నా .. పీఎం కిసాన్ సొమ్ము ఖాతాలకు జమ కావాలన్నా ఇది తప్పనిసరి. దీంతో విధిగా ప్రతి ఈ రైతు ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఈ-పంట నమోదు చేసుకున్నా ఈ - కేవైసీ దగ్గరకొచ్చేసరికి ప్రక్రియ పూర్తి కాక ఏటా 10 నుంచి 230 శాతం మంది రైతులు ఆర్థిక లబ్ధి పొందలేక పోతున్నారు. ఈ -కేవైసీ పై పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం, రైతులు స్థానికంగా అందుబాటులో ఉండక పోవడంతో ఈ ప్రక్రియ పూర్తి కావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకొచ్చింది.

ప్రక్రియ పూర్తి కాక....

సాంకేతికత అందుబాటులోకి వచ్చినా ఇప్పటికీ పలువురు రైతులకు ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు పొందలేకపోతున్నారు. ఈ - కేవైసీ పూర్తి చేయించుకునేందుకు ఇకపై అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అన్నదాతల సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వం కిసాన్ యాప్ అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్ ఫోన్‌లో ఈ - కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకునే అవకాశం రైతుల ముంగిటకే వచ్చింది.

ఇంకా 13వేల మందికి పైనే ...

సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో 2,07,953 ఎకరాల్లో 72,686 మంది రైతులు పంటలు సాగు చేస్తున్నారు. వీరిలో 59,682 మంది ఈ-కేవైసీ పూర్తి చేయించుకోగా 13,004 మంది



యాప్ ద్వారా ఈ-కేవైసీ నమోదు చేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు

రైతులు ఇంకా పూర్తి చేయించుకోవాల్సి ఉంది. మిగిలిన వారికి పీఎం కిసాన్ యాప్ ద్వారా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. గతంలో ఈ - కేవైసీ పూర్తి చేయించేందుకు ప్రభుత్వాలు పలుమార్లు గడువు పెంచినా .. నూరు శాతం పూర్తయ్యేందుకు అధికారులకు తలకి మించిన భారంగా మారేది. నమోదు సులభతరం కావడంతో రైతులు ప్రభుత్వ సాయం పొందేందుకు ఇలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు భావిస్తున్నారు.

సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో....

మండలం	సాగువిస్తీర్ణం (ఎకరాలు)	రైతులు	ఈ-కేవైసీ పూర్తయ్యింది	పూర్తిచేయాల్సిన రైతులు
సత్తెనపల్లి	34,653	11,343	9,880	1,463
ముప్పాళ్ళ	21,552	7,210	6,147	1,063
రాజుపాలెం	14,131	6,053	4,545	1,508
పెదకూరపాడు	24,294	8,659	7,257	1,402
అమరావతి	26,755	8,608	7,258	1,350
అచ్చంపేట	26,366	8,905	7,100	1,805
క్రోసూరు	24,438	8,521	6,901	1,620
బెల్లంకొండ	14,107	3,919	2,968	951

స్మార్ట్ ఫోన్ ద్వారా ఇలా ....

- ఈ - క్రాప్ , ఈ - కేవైసీ ముఖ ఆధారిత విధానంలో నమోదు ప్రక్రియ ఎవరికి వారే పూర్తి చేసుకోవచ్చు.
- ముందుగా సెల్‌ఫోన్‌లోని ప్లేస్టోర్లోకి వెళ్లి పీఎం కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- కిసాన్ యాప్‌లో ఆధార్ సంఖ్య నమోదు చేయగానే పీఎం కిసాన్ దరఖాస్తులో నమోదు చేసిన సెల్‌ఫోన్ నంబరుకు వన్‌టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) వస్తుంది. దీనికి ఆధార్ లింక్‌తో సంబంధం ఉండదు.
- ఓటీపీ నమోదు చేయగానే ఉద్యోగులు ముఖ ఆధారిత హాజరు నమోదు చేస్తున్నట్లు గా వస్తుంది. ఫోన్‌లోని ముందు కెమెరా ఎదుటగా కళ్లు కదిలించాలి. అదే రైతు, ' అవే కళ్లు అయితే యాప్లో ఓకే అని వస్తుంది. దీంతో ఈ - కేవైసీ ప్రక్రియ పూర్తయి రైతులకు సంబంధించిన పూర్తి వివరాలు వస్తాయి.

సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలి



ప్రభుత్వాలు అన్నదాతల కోసం సాంకేతికతను అందుబాటులోకి తెచ్చాయి. రైతులు ఈ-కేవైసీని ఎక్కడ నుంచైనా పూర్తి చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక యాప్ అందు బాటు లోకి తెచ్చింది. ఈ విధానం ద్వారా వ్యవసాయశాఖ సిబ్బంది ప్రస్తుతం పలువురికి ఈ-కేవైసీ పూర్తి చేస్తున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వాలు అందిస్తున్న లబ్ధి పొందాలి.

-ఎస్.శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు, సత్తెనపల్లి

క్లుప్తంగా

నేటి నుంచి రీసర్వే ప్రారంభించాలి

నకరికల్లు: రీసర్వే పనులను వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎస్. సురేష్ వీఆర్వోలు, సర్వే సిబ్బందిని ఆదివారం ఆదేశించారు. మండలంలోని చీమలమర్రి గ్రామంలో హద్దురాళ్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలన్నారు. సర్వే చేపట్టాల్సిన గ్రామాల్లో సోమవారం సర్వేపనులను ప్రారంభించాలన్నారు. గ్రామాల్లోని రైతుల సహకారంతో వ్యవసాయ భూముల రీసర్వే చేపట్టాలని సూచించారు.

వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పోటీలు



క్రోసూరు: వేసవి విజ్ఞాన శిబిరం నేపథ్యంలో విద్యార్థులు పలు అంశాలపై పట్టు సాధిస్తున్నారని గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ వేసవి విజ్ఞాన శిబిరంద్వారా విద్యార్థులకు ప్రతి రోజు నీతికథలు బోధించడం జరుగుతుందన్నారు. తద్వారా విద్యార్థుల జీవనశైలిలో మార్పు కలుగుతుందన్నారు. పోటీల్లో భాగంగా లెమన్‌స్పూన్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ధనుష్, రాఘవ ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారని తెలిపారు.

కృష్ణ నదిలో గుర్తు తెలియని మృతదేహం

పెదకూరపాడు: అమరావతిలోని అమరేశ్వర ఘాట్ వద్ద ఆదివారం గుర్తు తెలియన మృతదేహం లభ్యమైనట్లు అమరావతి సీఐ బ్రహ్మం తెలిపారు. అమరేశ్వర ఘాట్ వద్ద కృష్ణనదిలో గుర్తు తెలియని మృతదేహం పడి ఉండడంతో స్థానికులు గుర్తుంచి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతదేహం సుమారు 55 సంవత్సరాలు ఉంటుందని, తెల్లని గడ్డ, బన్నిలో ఉన్నట్లు సీఐ బ్రహ్మం తెలిపారు. వివరాలు తెలిసిన వారు అమరావతి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



వినుకండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీనివాస నగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జేష్ఠ పౌర్ణమి సందర్భంగా లోక కల్యాణం నిత్తం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. 108 కలశాలతో స్వామికి సహస్రనమార్చన తిరుప్పావడ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తు పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు రెడ్డిబంగారయ్య మాట్లాడుతూ ఈఏడాది వర్షాలు బాగా కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామికి ప్రత్యేక పూజలు చేసినట్లు చెప్పారు.

ఉచిత వైద్యశిబిరం

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో వేద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ నవులూరి క్రాంతికుమార్‌రెడ్డి పాల్గొని పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులకు అవసరమైన బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. పరీక్షల అనంతరం రోగనిర్ధారణ చేసి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, మాజీ సర్పంచి పడాల చక్రారెడ్డి పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకున్న సూరిబాబుకు సత్కారం

వినుకొండ(నూజెండ్ల): గౌరవ డాక్టరేట్ పొందిన వినుకొండ వాసి హోటల్ నిర్వాహకులు సూరిబాబును ఆదివారం ఘనంగా సత్కరించారు. పట్టణంలోని బోసుబొమ్మ సెంటరులోని సాయిబాబా దేవాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం ద్దూరి వీరయ్య, వీరరాఘవు మాట్లాడుతూ వినుకొండలో హోటల్ రంగంలో 40 ఏళ్ల నుంచి కొనసాగుతూ ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చి యూనివర్సిటీ చెన్నై నుంచి అవార్డుకు ఎంపిక చేయడం వినుకొండకు గర్వకారణమన్నారు. అనంతరం దుశ్శాలువాలు , పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మేడం రమేష్ పాల్గొన్నారు.

నెల్లూరు జిల్లా వెళ్లి పింఛన్ అందజేత

నరసరావుపేట రూరల్: మండలంలోని గురవాయపాలెం గ్రామానికి చెందిన డి.అంజమ్మ రెండు నెలల క్రితం ప్రమాదంలో గాయపడటంతో కాలికి శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లా తడకలూరులోని తన చిన్న కుమార్తె వద్ద విశ్రాంతి తీసుకుంటుంది. ప్రతి నెల పింఛన్ ఇచ్చే వలంటీర్ అంగలకుర్తి కృష్ణ మనోహర్ ఆదివారం నెల్లూరు జిల్లాకు వెళ్లి అంజమ్మ బయోమెట్రిక్ తీసుకుని ఫించన్ అందజేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో ప్రతిష్టా మహోత్సవాలు



ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకాలు చేస్తున్న భక్తులు



ప్రతిష్ఠకు సిద్ధమైన దేవాలయం

12న శ్రీసీతారామ దేవాలయం ప్రతిష్ట

శావల్యాపురం: మండలంలోని కారుమంచిలో శ్రీసీతారామ స్వామి ఆలయ నూతన ప్రతిష్టా మహోత్సవం ఈనెల 12వ తేదీ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. దాతల సహకారంతో నూతన ప్రతిష్ట కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతిష్టా కార్యక్రమాలు ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయన్నారు.

గణపవరంలో ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు

నాదెండ్ల: గణపవరంలో భారీ వ్యయంతో పూర్తిగా రాతితో నిర్మించిన రామాలయం విగ్రహ ప్రతిష్ట, కలశ, జీవధ్వజ ప్రతిష్టా కార్యక్రమం ఈనెల ఏడో తేదీన నిర్వహించనున్నారు. ఆదివారం మూల మూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థాన వేద పాఠశాల అధ్యాపకులు మాల్యవంతం శ్రీనివాస్ దీక్షితుల బృందం ఆధ్వర్యంలో కెల్లంపల్లి వీరయ్య ధర్మసత్రం ఆవరణలో ఏర్పాటు చేసిన యాగశాలలో శాంతిహోమాలు నిర్వహించారు. అనంతరం మూలమూర్తులకు జలాధివాసం నిర్వహించారు. ధ్వజస్తంభానికి కలశాలు, విగ్రహాలకు పూజలు నిర్వహించారు. ఈనెల 7న ఉదయం జరిగే ప్రతిష్టా కార్యక్రమానికి త్రిదండి చినజీయర్‌స్వామి హాజరుకానున్నారు. గుంటూరు హిందూ కళాశాల విశ్రాంత సంస్కృత ఉపాధ్యాయులు డాక్టర్ దీవి నర్సింహదీక్షితులు ధార్మిక ఉపన్యాసం చేశారు. చినజీయర్ స్వామిజీ శిష్యులు గుడిమెళ్ల కూర్మనాథస్వామి, రామాయణ ప్రవచనం నిర్వహించారు. పీఠలపై పాతికమంది దంపతులు కూర్చొని హోమాలు నిర్వహించారు.

నేటి నుంచి వేణుగోపాల స్వామి ప్రతిష్టా మహోత్సవాలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న సంతాన వేణుగోపాలయ దేవాలయ ప్రతిష్టా మహోత్సవాలు ఆదివారం ప్రారంభించారు. 8వ తేదీ వరకు ప్రతిష్టా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, యువత అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

నరసరావుపేట ఈస్ట్: శ్రీరాంపురంలోని బ్రహ్మంగారి గుడి వద్ద హిందూ పరివార్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి దశ సహస్ర హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన పారాయణంలో 1008 మంది భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం గావించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్‌బాబు, వాసవి అన్నదాన సత్రం కార్యనిర్వాహక అధ్యక్షుడు వీఎస్‌పీ సాంబశివరావు, హిందూ పరివార్ కమిటీ ప్రతినిధులు కొత్తూరి వెంకటనరసింహారావు, గోపవరపు శ్రీనివాసరావు, శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, శ్రీవాసవి అమ్మవారి అలయ చైర్మన్ కొత్తమాసు వెంకటయల్లారావు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాలాది శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో అన్ని సబ్జెక్టులు బోధించేందుకు అనుభవం అర్హతలు కలిగిన లెక్చరర్ల ఏడుగురిని ప్రభుత్వం నియామకం చేసినట్లు చెప్పారు. బాలికల జూనియర్ కళాశాల ప్రవేశాల కొరకు ప్రత్యేకంగా ఉపాధ్యాయులు అన్నీ గ్రామాల్లో క్యాంపెయన్ కూడా నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేయటంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులను స్వయంగా కలిసి కళాశాల గురించి వివరించామన్నారు. ఆయనతో పాటు లెక్చరర్ల కె.శ్రీనివాసరాజు, పి.సురేష్ కుమార్, కవిత, లిల్లీకిరణ్మయి, విమలాకుమారి పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి



శిరిగిరిపాడులో ఏరువాక సాగుతున్న రైతులు



కొత్తపల్లిలో ఏరువాక సందర్భంగా ఊరేగింపు నిర్వహిస్తున్న, వైఎస్సార్ సీపీ నాయకులు

గురజాల : వర్షఋతువులో వచ్చు జ్యైష్ట శుద్ధ పౌర్ణమిని రైతులు ఏరువాక పున్నమిగా జరుపుకుంటారు. మండలంలోని రైతులు ఆదివారం సాయంత్రం ఏరువాక పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ పనులను ప్రారంభించారు. ముందుగా సంప్రదాయ దుస్తులు ధరించి ఎద్దులను పసుపు కుంకుమలతో ప్రత్యేకంగా అలంకరించి నాగలిని పూజించి పొలంకు వెళ్లి దుక్కిదున్ని పనులు ప్రారంభించారు. రైతులు ఈ ఏడాది కూడా మంచి దిగుబడి సాధించాలని ఆకాంక్షిస్తూ పనులు ప్రారంభించారు.

వెల్దుర్తి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏరువాక పౌర్ణమిని రైతులు ఘనంగా నిర్వహించారు. రైతులు తమ పంట పొలాల్లో చెట్లు కొట్టి అరకలు దున్ని పొలాలను చదును చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సక్రమంగా పండాలని, రైతులు గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిరిగిరిపాడు, గుండ్లపాడు, వెల్దుర్తి, కండ్లకుంట గ్రామాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఏరువాక సాగారు. ఉండ్రాళ్ళతో వినాయకునికి పూజలు నిర్వహించి ఊరేగింపుగా బయలుదేరి వెళ్ళారు.

కొత్తపల్లిలో ఏరువాక పండుగ

మాచర్ల రూరల్: రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టే ఏరువాక మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఏరువాక పౌర్ణమి పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని రైతులు వినాయకుని స్వామి ఉండ్రాళ్ళను తయారు చేసి గ్రామంలో వాటిని వీధుల్లో ఊరేగింపు నిర్వహించి వినాయకునికి నైవేద్యం పెట్టారు. గత నాలుగు సంవత్సరాల నుంచి సకాలంలో వర్షాలు కురుస్తూ రైతన్నలకు అండగా నిలుస్తున్న స్వామి వారు ఈ ఏడాది తమ పై దయ చూపి సిరులు కురిపించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంట పొలాల్లో అరకలు దున్ని పొలాలను చదును చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ పూజారి గిరిశర్మ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్ రెడ్డి, ఉప సర్పంచ్ దశబంధపు కొండలు, మండల ఉపాధ్యక్షుడు పోతిరెడ్డి సుజాత కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు హనిమిరెడ్డి, పున్నారెడ్డి, బాలిరెడ్డి, జయభారత్‌రెడ్డి తదితరులున్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

మాచర్ల: అనారోగ్యంతో ఇబ్బంది పడే ప్రతి కుటుంబాన్ని ఆదుకునే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాధితులకు చేయూతనందిస్తున్నట్లు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకున్న నిమ్మల శ్యామలా దేవికి సీఎం రిలీఫ్ కింద మంజూరైన రూ. 55వేల చెక్కును అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రజల ఆరోగ్యం కోసం ఆరోగ్య శ్రీ, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి, గ్రామస్థాయిలో ప్రతి ఊరికి వైద్యం అందజేసే విధంగా బలోపేతం చేశారన్నారు. ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని పేద ప్రజలు అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఆయా పట్టణ నాయకులు, మండల నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏరువాక పున్నమి వేడుకలు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో ఏరువాక పున్నమి వేడుకలు పడమటి బజారు బీసీ కాలనీవాసులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వీరరాఘవుల స్వామి ఉత్సవాల్లో భాగంగా మస్తానయ్య జెండాలు ఊరేగింపు, స్వామి కల్యాణ వేడుకలు దంపతులతో నిర్వహించారు. అనంతరం సాయంత్రం గ్రామ పురవీధుల్లో ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణపై కళాజాత

నరసరావుపేట: రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యంపై కళాజాత బృందం ఆదివారం అవగాహన కల్పించారు. మార్కెట్‌సెంటర్, రైల్వేస్టేషన్ సెంటర్లలో ప్రదర్శనల ద్వారా ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కలిగించారు. సోమవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ ఆఫీస్ పర్యవేక్షణలో గ్లోబల్ ఎన్విరాన్మెంటల్ స్టూడెంట్ అవేర్నెస్ ఆర్గనైజేషన్‌కు చెందిన కళాకారుల బృందం ప్రచార చేశారు. ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వలన జరిగే అనర్థాలు, మిషన్‌లైఫ్‌లో జీవన విధానాన్ని మెరుగుపర్చుకునేందుకు పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాటలు పాడుతూ వివరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

గురజాల: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురజాల ఎస్ఐ బి అనంత కృష్ణ ఆదివారం సాయంత్రం పట్టుకున్నారు. స్థానిక బ్రహ్మనాయుడు విగ్రహం సెంటర్‌లో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఏపీ 3 9టీవై8070 నంబరు గల మినీ లారీలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని గుర్తించి వాహనాన్ని ఎస్ఐ స్వాధీనం చేసుకున్నారు. ఈ వాహనం గోగులపాడు నుంచి అంబాపురం మీదగా గురజాల వచ్చిందని, లారీలో 94 బస్తాల రేషన్ బియ్యం ఉన్నాయని, వాటి బరువు 4,740 కిలోలున్నాయని ఎస్ఐ తెలిపారు. వాహనాన్ని బియ్యంతో సహా సీజ్ చేసి ఎస్ఐ అనంతకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తూనికలు కొలతలశాఖ అధికారుల తనిఖీలు

క్రోసూరు: మండల కేంద్రమైన క్రోసూరులో తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆదివారం మటన్, చికెన్, విక్రయిస్తున్న దుకాణాల్లోని తూనికల వినియోగంపై తనిఖీలు చేశారు. సత్తెనపల్లి తూనికలశాఖ అధికారి షేక్ జాన్‌సైదా తెలిపిన వివరాల మేరకు క్రోసూరులో 11 షాపులపై కేసులు పెట్టామని వారందరికీ తొలి విడత హెచ్చరికగా అపరాధ రుసువు వేసామని చెప్పారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తూనికల్లో తేడాలు ఉన్నట్లు తెలిసిస్తే తమకు వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఫోను: 9885127512 చేయవచ్చునన్నారు.



మటన్ షాపులో ఎలక్ట్రానిక్ కాటాను పరిశీలిస్తున్న తూనికల అధికారి షేక్ జాన్‌సైదా

భగవద్గీత చదివి జన్మను సార్థకం చేసుకోవాలి

అచ్చంపేట: ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత భగవద్గీత చదివి జన్మను సార్థకం చేసుకోవాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు ఘుడియం పెద్దిరెడ్డి అన్నారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని రుద్రవరం, కోగంటివారిపాలెం, చిగురుపాడు గ్రామాల్లో ఆదివారం భవద్గీత ప్రతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులవారు రాసిన సంచలనాత్మక ఆధ్యాత్మక గ్రంథములు గొప్పశక్తికలవన్నారు. ఎందరికో కనువిప్పు కలిగించి యదార్థం తెలిపి మనుష్యులను యోగ్యులుగా తీర్చిదిద్దగలిగాయన్నారు. వారిచే భాష్యం రాయబడిన భవద్గీతలో ప్రతి శ్లోకంకు వివరణ ఇంతవరకు ఎవరూ ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు ఎలిశెట్టి రమేష్, పోతురాజు, పగడాల రామయ్య, కుంచాల చిన్న వెంకయ్య, పెరుగు ఏడుకొండలు, చల్లగుండ్ల భాస్కరరావు, పెరుగు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు

విత్తనాల కొనుగోలు బిల్లులు తీసుకోవాలి

మండల వ్యవసాయాధికారి అరుణ

ముప్పాళ్ళ: రైతులు ఖరీఫ్ సాగులో భాగంగా కొనుగోలు చేసే విత్తనాలకు సంబందించి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ ఆదివారం చెప్పారు. విత్తనాలు ఉన్న సంచులు సరైన సీలుతో ధృవీకరణ పత్రంతో ఉన్న వాటినే కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలకు సంబందించి మొలకశాతం పరీక్షించుకున్న తర్వాతే పొలంలో నాటుకోవాలన్నారు. దుకాణదారుని వద్ద నుంచి బిల్లు తీసుకోవాలన్నారు. తీసుకున్న బిల్లుపై డీలరు సంతకం ఉందో లేదో పరిశీలించుకోవాలన్నారు. జాగ్రత్తగా భద్రపరుచుకోవాలన్నారు. మొలకశాతం సరిగ్గా లేకుంటే వ్యవసాయశాఖ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. విత్తనంలో ఉన్న రకాలను గమనించుకోవాల్సి ఉంటుందన్నారు. పంట నష్టం జరిగితే రైతుకు రశీదే కీలకమన్నారు. కాబట్టి పంట కాలం పూర్తయ్యే వరకు కొనుగోలు చేసిన బిల్లును జాగ్రత్తగా భద్రపరుచుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

పాండురంగస్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

నరసరావుపేట ఈస్ట్: పాతూరులోని శ్రీరుక్మాబాయి సమేత శ్రీపాండురంగస్వామి దేవాలయం అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలోని శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పల్నాడు జిల్లా పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ మిట్టపల్లి రమేష్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ అధ్యక్షుడిగా టి.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎ.వి.సీతారామయ్య, కోశాధికారిగా పి.వి.లక్ష్మీవరప్రసాదరావు, చీఫ్ ఆర్గనైజర్‌గా బి.వెంకటేశ్వరరావుతో పాటు మరో ఏడుమంది కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ డి.వెంకటేశ్వరరావు, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పూరా భాస్కరరావు, శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



నూతన కమిటీ ప్రతినిధులను అభినందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

సాగర్‌మాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు



భక్తులకు సందేశం ఇస్తున్న గురువులు జోసఫ్ బాలసాగర్



దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

విజయపురిసౌత్: శాంతి, సమాధానం, ప్రేమ, కరుణ భక్తులకు ప్రసాదించాలని ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ అన్నారు. ఆదివారం సాగర్‌మాత దేవాలయంలో నిర్వహించిన దివ్యబలిపూజా కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. పరిశుద్ధాత్మ అయిన ఏసుక్రీస్తుకు జన్మను ప్రసాదించిన సాగర్‌మాత ఆశీస్సులు మీ అందరి యందున ఉంటాయని, ఆ తల్లిని భక్తి విశ్వాసాలతో పూజిస్తే కోరికలతో పాటు పాపాలు సైతం చెరిగిపోతాయని ఉద్బోధించారు. అనంతరం భక్తులు దేవాలయంలో తలనీలాలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆ తరువాత దేవాలయ ప్రాంగణంలో జరిగిన తేరు ప్రదక్షణలో భక్తులు పాల్గొన్నారు.

బోరింగ్ ఏర్పాటు

పిడుగురాళ్లరూరల్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి 66 సంవత్సరాలు పూర్తి చేసుకుని 67వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా మండలంలోని పందిటివారిపాలెం గ్రామంలోని బీసీ కాలనీలో మంచినీటి వసతి తీర్చేందుకు ఆదివారం బోరింగ్‌ను ఏర్పాటు చేశారు. పిడుగురాళ్ల జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య సొంత నిధులతో బీసీ కాలనీ ప్రజలకు దాహార్తి తీర్చేందుకు బోరింగ్ వేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

